# జీవనోపాధులు

... భవితవ్యం

అక్టోబర్ 2013


ఎందరో మహానుభావులు...

# మహాత్మా గాంధీ



మహాత్మా గాంధీగా పిలువబడే మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో 1869, అక్టోబర్ 2న జన్మించారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన గాంధీ, బ్రిటిష్ పాలన నుంచి దేశం స్వాతంత్ర్యం పొందేలా జాతిని మేల్కొలిపారు.గాంధేయ సిద్ధాంతాలలో సత్యాగ్రహం, అహింస మార్గదర్శక నియమాలు. ఆయన ఆర్థిక, సామాజిక భావాలలో కూడా ఈ నియమాలను గమనించవచ్చు. నీతిబాహ్యమైన, ఇతరులను పీడించే ఆర్థిక విధానాలను ఆయన హింసాత్మక ఆర్థిక విధానాలుగా పేర్కొన్నాడు. ఆర్థిక విధానాలను నైతిక నియమాల నుంచి వేరు చేసి చూడరాదని ఆయన భావించేవాడు. పారిశ్రామికాభివృద్ధి తన బాగు కోసం వ్యక్తుల/దేశం వనరులను కబళించేందుకు అనుమతిస్తుందని అంటూ ఆయన దానిని నిరాకరించారు. ఇతర వ్యక్తులు లేదా ఇతర దేశాల నైతికతను దెబ్బ తీసే ఆర్థిక వ్యవస్థ ఏదైనా నీతిబాహ్యమైనదని ఆయన ప్రవచించేవారు.

సర్వోదయ లేదా అందరి బాగును కోరే ప్రాతిపదికపై ఏర్పడిన ఆర్థిక వ్యవస్థను ఆయన ప్రతిపాదించారు. ఈ వ్యవస్థలో ప్రతి ఒక్కరి అవసరాలూ తీరడానికి కావలసిన పని లభిస్తుందని ఆయన భావించారు. ఆహారం, తిండి కోసం ఏ ఒక్కరూ బాధ పడరాదు. ఆర్థిక కార్యకలాపాలు ఏ ఒక్కరి దురాశా ప్రేరణ కారాదు. ఈ ప్రపంచంలో మానవుల అవసరాలకు తగినన్ని వనరులున్నాయి కానీ వారి దురాశ తీర్చేటందుకు సరిపోయేటన్నీ అని గాంధీజీ అన్నారు. నిజమైన ఆర్థిక విధానాలు సామాజిక న్యాయం కోసం పాటు పడతాయి, బలహీనులతో పాటు సకల జనావళి శ్రేయస్సునూ కోరతాయి. ఈ ఆదర్శాలు నిజం కావాలంటే ఉత్పత్తి సాధనాలు ప్రజల చేతుల్లో ఉండాలి. స్థానికంగా ఉత్పత్తి చేసి, స్థానిక ఉత్పత్తులను స్థానికంగానే వినియోగించుకోవాలి. భారతదేశపు గ్రామాల్లోని ఆర్థిక వ్యవస్థనే ఒక ఆదర్శవంతమైన నమూనాగా చూపుతూ, గాంధీజీ మళ్లీ మళ్లీ వీటినే అహింసాత్మ ఆర్థిక విధానాలుగా సూచించేవారు. ఈ వ్యవస్థ మానవుని హక్కుల మీద కాకుండా, బాధ్యతల మీద ఆధారపడి నడుస్తుంది. భారీ యంత్రాల స్థానంలో ఇక్కడ శారీరక శ్రమ కేంద్రంగా ఉంటుంది. ఇక్కడ పరికరాలు కేవలం మానవుని స్థానాన్ని భర్తీ చేయడానికి కాకుండా, ఉత్పత్తిని పెంచే సాధనాలుగా మాత్రమే ఉపయోగపడతాయి. పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థలో భారీ యంత్రసామాగ్రి అవసరం. వీటి ద్వారా సాధించిన లాభాల్లో ఎక్కువ భాగం యజమానులే కైవసం చేసుకుంటారు. దీనికి తోడు, జనాభా ఎక్కువగా ఉన్న భారతదేశం లాంటి దేశాల్లో భారీ యంత్రసామాగ్రి వినియోగం వల్ల నిరుద్యోగం పెరిగిపోతుందని గాంధీజీ భావించారు.




గాంధీజీ ఆలోచనా విధానంలో స్వదేశీ భావన ప్రధాన సూత్రం. గాంధీజీ ఉద్దేశంలో స్వదేశీ అంటే, స్థానికంగా ఉత్పత్తి చేసుకుని, స్థానికంగా వినియోగించుకుకోవాలి. ప్రజలు ప్రతి చోటా తామే ఉత్పత్తి చేసుకుని, తామే వినియోగించుకుంటే, అప్పుడు స్వయంసమృద్ధి సాధించ గలుగుతామని ఆయన భావించేవారు. వనరులన్నీ సమానంగా పంపకం జరగాలి. చిన్న పరిశ్రమలు స్థానికులకు లాభదాయకమైన ఉపాధులు కల్పిస్తాయి. స్వదేశీ అంటే గాంధీజీ భావనలో, స్థానిక వినియోగం. స్థానికత్వంలో గర్వం, స్థానికులకు సహాయపడడం, స్థానికత్వాన్ని ప్రతిపాదించి, స్థానికంగా జీవించడం. మరీ ముఖ్యంగా వికేంద్రీకృత విధానం ద్వారా స్థానిక స్వాతంత్ర్యం మరియు అందరికీ ఉపాధి. అలాంటి వ్యవస్థలో అధికారం స్థానికుల వద్దే కేంద్రీకృతమై ఉంటుంది.

ఖాదీ స్వయం సమృద్ధికి చిహ్నం. మిల్లుల్లో నేసిన వస్త్రాలను విసర్జించి, ఇంటిలో నేసిన దుస్తులను ధరించాలని గాంధీజీ తన అనుచరులకు ప్రబోధించారు. స్వాతంత్ర్యానంతరం కూడా ప్రభుత్వాలు, అనేక ప్రైవేటు సంస్థలు ఖాదీని ప్రోత్సహిస్తున్నాయి. పేదలలో స్వయం సమృద్ధి సాధించడానికి వారికి ఉపాధి కల్పించడానికి, ఖాదీని ఉత్పత్తి చేసే ఉద్దేశంతో ప్రభుత్వం 1957లో ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (KVIC)ని స్థాపించింది. ఖాదీని ప్రోత్సహించే ప్రణాళికలు రూపొందించడం, వాటిని అమలు చేయడంతో పాటు, ఉత్పత్తిదారులకు అవసరమైన ముడిపదార్థాలను అందించడం, ఖాదీ ఉత్పత్తిలో నూతన పరిశోధనా పద్ధతులను ప్రోత్సహించడం తదితర కార్యకలాపాలను కేవీఐసీ చేపడుతుంది. గ్రామీణ పరిశ్రమలు ప్రారంభించాలనుకునే సంస్థలకు కేవీఐసీ సహకారాన్ని కూడా అందిస్తుంది. కేవీఐసీ పరిధిలో ఖనిజ, వ్యవసాయ, ఆహార, పాలిమర్,

రసాయన, అటవీ ఆధారిత పరిశ్రమలు, గ్రామీణ సాంకేతిక పరిజ్ఞాన పరిశ్రమలు, సేవా పరిశ్రమ కూడా ఉన్నాయి.

వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఏర్పాటు చేసిన 33 కేవీఐసీ బోర్డుల వ్యవస్థ ద్వారా KVIC పని చేస్తుంది. ఖాదీ గ్రామోద్యోగ సంఘం తదితర సంస్థలకు కూడా ఇది సహకరిస్తుంది. చెన్నైలోని ఖాదీ గ్రామోద్యోగ్ భవన్ (గతంలో దీనిని ఇలాగే పిలిచేవారు) 1957 నుంచి 1969 వరకూ KVIC పరిధిలోనే ఉండేది. 1969లో ఖాదీ గ్రామోద్యోగ సంఘ్‌గా రిజిష్టరైన ఈ సంస్థ, నాటి నుంచి ఖాదీ, గ్రామీణ ఉత్పత్తులను ప్రోత్సహిస్తోంది. నేటి వినియోగదారుల అభిరుచులు, అలవాట్లకు అనుగుణంగా ఖాదీ, గ్రామీణ పరిశ్రమలను మార్చడానికి ఈ సంస్థ కృషి చేస్తోంది. ఇది కేవలం ఖాదీ ఉత్పత్తులకు ఒక మార్కెటింగ్ ఔట్‌లెట్ మాత్రమే కాకుండా, అహింసాయుత, దోపిడీరహిత సామాజిక విధానాలను రూపొందించే దిశగా కృషి చేస్తోంది. రెడీమేడ్ ఖాదీ దుస్తులను మొదటిసారి తయారు చేసింది ఈ సంస్థే. బొమ్మలు (ప్రత్యేకించి దసరా సందర్భంగా), చందనం, రోజ్‌వుడ్, టేకు ఉత్పత్తులు, తేనె, ఆభరణాలు, తోలు ఉత్పత్తులు తదితర వాటితో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేసి, వాటికి ప్రచారం కల్పిస్తుంది. చెన్నైలో తక్కువ ధరకు పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను సరఫరా చేసే క్యాంటీన్లను కూడా ఈ సంస్థ ప్రారంభించింది. విస్తృత ప్రాతినిధ్యం వల్లే సంస్థ అభివృద్ధి చెందుతుందన్న నినాదంతో ఈ సంస్థ శాకాహార బేకరీ ఉత్పత్తుల కోసం గిల్డ్ ఆఫ్ సర్వీస్ సేవా సమాజం తదితర సంస్థలు – గోపాలపురం వుమెన్ అండ్ ఆర్టిజాన్స్ కంబైన్ సహాయంతో మసాలా పొడుల ఉత్పత్తులను తయారు చేస్తోంది.

గాంధీజీ ఆలోచనా విధానాన్ని సజీవంగా ఉంచడానికి, గాంధేయ విలువల పరిరక్షణ కోసం ఖాదీ గ్రామోద్యోగ్ భవన్ ఒక యూత్ ఫోరమ్‌ను కూడా ప్రారంభించింది. ఖాదీని ఉత్పత్తి చేసే స్థానికుల నుంచే ఈ సంస్థ తన ఉద్యోగులను ఎన్నుకుంటుంది. గ్రామాలు స్వతంత్ర్యంగా ఉండే సామాజిక వ్యవస్థను గాంధీజీ కలలుగన్నారు. స్థానిక నైపుణ్యాలను, వనరులను ఉపయోగించుకునే కార్యకలాపాలలోనే గ్రామీణులు పాలు పంచుకుంటారు. కేవలం గ్రామీణ మార్కెట్లకు మాత్రమే ఇవి పరిమితమవుతాయి. ఎందుకంటే భారీ ఉత్పత్తి చేసి, వాటిని ఇతర ప్రాంతాలకు తరలిస్తే, దాని వల్ల అక్కడి ఉత్పత్తిదారులు ప్రమాదంలో పడతారు. అందువల్ల ప్రధానంగా ఖాదీ, హస్త కళలు, చేనేత వస్త్రాలు, వ్యవసాయోత్పత్తులపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరిస్తారు.

గాంధీజీ శిష్యుడైన మణిభాయ్ దేశాయ్ 1967లో భారతీయ ఆగ్రో ఇండస్ట్రీస్ ఫౌండేషన్ (BAIF) అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. ఆహార భద్రత, సురక్షితమైన తాగు నీరు, ఆరోగ్యం, లైంగిక వివక్షను అరికట్టడం, శిశు మరణాలను అరికట్టడం, అక్షరాస్యత పెంచడం, ఉన్నతమైన నైతిక విలువలు, పరిశుభ్రమైన పర్యావరణాన్ని పెంపొందించడం తదితరాల కొరకు దీనిని నెలకొల్పారు. మొదట పశుగణాన్ని అభివృద్ధి చేయడానికి ఉద్దేశించబడిన ఈ సంస్థ తర్వాత సుస్థిరమైన జీవనోపాధులను ప్రోత్సహించే ఉద్దేశంతో సహజవనరుల పరిరక్షణకు పూనుకుంది. స్థానికులు, మరీ ప్రత్యేకించి అణగారిన వర్గాల వారిని కలుపుకుంటూ వారు లాభదాయకమైన స్వయం ఉపాధి అవకాశాలు సంపాదించుకోవడానికి, పెంపొందించుకోవడానికి సహాయపడుతున్న BAIF నేడు దేశవ్యాప్తంగా గౌరవించబడుతోంది.

స్థానికులు తమ జీవనోపాధి అవకాశాలను పెంపొందించుకునే విధంగా సహజ వనరులను వినియోగించుకునేందుకు ఈ సంస్థ కృషి చేస్తుంది. ఇందుకోసం స్థానిక వనరులు ఉత్పాదకతను ఏ విధంగా పెంచుతాయో కనుగొనడానికి BAIF అనేక పరిశోధనలు చేస్తుంది. ప్రస్తుతం 16 రాష్ట్రాలలో పని చేస్తున్న BAIF 9 సంస్థలలోని 4,500 ఉద్యోగుల ద్వారా తన కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఉరులికంచన్‌లోని ఒక కేంద్ర పరిశోధనా సంస్థ ద్వారా ఇది దేశవ్యాప్తంగా అనేక పరిశోధనా కేంద్రాలు కలిగి ఉంది.

విద్య అంటే కేవలం అక్షరాస్యత కాదనీ, దానిని మించినదనీ గాంధీజీ భావించారు. అది కేవలం విద్యాసాధనకు ఒక పరికరం మాత్రమే. ఒక వ్యక్తి సంపూర్ణ వికాసానికి దోహదపడే ప్రక్రియే విద్య. అక్షరాస్యత అంటే మూడు 'R'లలో రాణించడంగా చెప్పవచ్చు – రైటింగ్ (రాయడం), రీడింగ్ (చదవడం), అరిథమేటిక్ (లెక్కలు). వ్యక్తి సంపూర్ణాభివృద్ధికి నయీ తాలిమ్ అనే సంపూర్ణమైన నూతన విద్యావ్యవస్థను గాంధీజీ ప్రవచించారు. నయీ తాలిమ్ కేవలం అక్షరాస్యత, మెదడుకు మాత్రమే పని పెట్టే ఆధునిక విద్యావ్యవస్థలా కాకుండా శరీరం, మెదడు రెండింటికీ పని పెట్టేలా కళలు, ఆరోగ్యం, చేతివృత్తులు కూడా ఉంటాయి. గ్రామీణ పరిశ్రమల శక్తితో ఆర్థిక వ్యవస్థ వికేంద్రీకరణ జరిగినట్లే, గాంధీజీ విద్యాపీఠాలను కూడా గ్రామీణ ప్రాంతాలకు తీసుకుపోవాలని భావించారు. ఈ ఆలోచలనలకు అనుగుణంగా గాంధీజీ 1920లో అహ్మదాబాద్‌లో గుజరాత్ విద్యాపీఠాన్ని స్థాపించారు. దీనిలో సత్యం, అహింస మూల విలువలుగా ఉండేవి. పాఠ్యాంశాలన్నీ పని–విద్య–ఆధారంగా గ్రామీణ అవసరాలనకు తగినట్లుగా ఉండాలనీ, బోధన మొత్తం మాతృభాషలోనే ఉండాలని ఆయన భావించారు. వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చెందే విధంగా దీనిలోని బోధనాంశాలు ఉండేవి. దీనిలో క్రమం తప్పకుండా స్థానిక కార్యక్రమాలలో పాల్గొనడం, గృహజీవనం, సామాజిక సేవ, సామూహిక ప్రార్థనలు, అతి సాధారణ, స్వయం సమృద్ధత కలిగిన జీవితం, విద్యా పర్యటనలు, క్షేత్రస్థాయి పర్యటనలు, చేనేత, చేతివృత్తులు ఉంటాయి. గాంధేయ ఆలోచనా విధానాన్ని అభివృద్ధి పెంచే దిశలో గుజరాత్ విద్యాపీఠ్ అనేక అంశాలలో పరిశోధనలు నిర్వహించేది.

నయీ తాలిమ్‌ను అమలు చేస్తూ విద్యను బోధించే ఏకైక లక్ష్యంతో 1957లో గాంధీగ్రామ్ గ్రామీణ సంస్థను స్థాపించారు. డాక్టర్ టీ.సుందరం, జీ.రామచంద్రన్ అనే ఇద్దరు గాంధేయవాదులు దీని వ్యవస్థాపకులు. ఇప్పుడు ఒక విశ్వవిద్యాలయంగా రూపు దిద్దుకున్న ఈ సంస్థ – గ్రామీణాభివృద్ధి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరియు అనుబంధ విద్య, గ్రామీణ దృక్పథ శాస్త్రం, సహకార విధానాలు, అభివృద్ధి

నిర్వహణ, గ్రామీణ సామాజిక శాస్త్రం, ఇంగ్లీష్ మరియు జీవనోపాధులు, సమాచార విద్యల్లో తమిళ, ఇతర భారతీయ భాషలలో విద్యాంశాలను రూపొందించుకుంది.

ఈ విశ్వవిద్యాలయం నుంచి పట్టా తీసుకున్న వారు సాధారణంగా గ్రామీణాభివృద్ధి రంగంలోని అనేక స్థాయిలతో పని చేస్తారు. నేడు గ్రామీణాభివృద్ధి పరిశోధనలో ఇది ఒక మార్గదర్శక విద్యా సంస్థగా రూపు దిద్దుకొంది.

పేదరికాన్ని రూపుమాపి, మన ఆర్థిక వ్యవస్థలో అందరికీ అవకాశాలు లభించే విధంగా తయారు చేయడానికి, వనరులను అందరికీ అందుబాటులోకి తీసుకురావడం తదితర పరిష్కారాల ద్వారా నేడు మనం అనేక ప్రయోగాలు చేస్తున్నాం. గాంధీజీ కాలంలో జమిందారీ వ్యవస్థ వేళ్లూనుకుని ఉండేది. దాని ప్రభావం వల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. రైతుల కష్టాలను గమనించిన గాంధీజీ, ఈ పరపీడనకు రోజులు దగ్గర పడ్డాయని గుర్తించాడు. రైతు, ఎన్నో రోజులు అణిగిమణిగి ఉండరని హెచ్చరించాడు. దీనికి పరిష్కారంగా ఆయన జమిందారులు రైతులకు ధర్మకర్తలుగా ఉంటారనీ, రైతులపై జమిందార్లకు ఎటువంటి హక్కులూ ఉండవని స్పష్టం చేశారు. ఒక చర్య వల్ల ఇతరులకు ఎలాంటి హాని కలగనప్పుడే అది సరైన చర్య అని గాంధీజీ చెప్పేవాడు.

గాంధీజీ ప్రవచించిన ఈ ఆలోచనా విధానాన్ని ఆయన అనుంగు శిష్యుడు వినోబా భావే భూదాన ఉద్యమం ద్వారా ఆచరణలోకి తీసుకువచ్చారు. శాంతి, అహింస అన్న సందేశాలను వ్యాప్తి చేయడానికి తాను హింసాత్మకమైన తెలంగాణ ప్రాంతంలో పర్యటిస్తానని ఆయన 1951లో ప్రకటించారు. తన పర్యటనలో భాగంగా ఆయన నల్గొండ జిల్లాలోని పోచంపల్లిలో సందర్శించడంతో తటస్థించింది.

ఆ గ్రామంలోని హరిజనులతో కలిసి మాట్లాడిన ఆయన, వారిలో ఏ ఒక్కరికీ ఒక్క ముక్క భూమి కూడా లేదని తెలుసుకున్నారు. ఆ 40 హరిజన కుటుంబాల వారు తమకు కావలసిందల్లా కేవలం 40 ఎకరాల భూమి మాత్రమే అని తెలిపారు. అదే సమయంలో ఆ గ్రామంలోని జమిందారు ఆ హరిజనులకు 100 ఎకరాలు ఇవ్వడానికి ముందుకు వచ్చారు. ఇదే భూదానోద్యమానికి ప్రేరణగా

## గాంధీ సందేశం

మహాత్ముని గురించి అందరికీ తెలుసు. ఆయన ప్రబోధించిన అహింసా సిద్ధాంతం దేశానికి స్వాతంత్ర్యం సంపా దించడమే కాదు, విదేశాల్లోనూ ఖ్యాతిని పొందింది. సత్యాగ్రహం అత్యంత శక్తివంతమైన ఆయుధంగా పేరొందింది. అలాంటి ఆయుధాన్ని ప్రసాదించిన జాతిపిత యువతను ఉద్దేశించి ఏమన్నాడో తెలుసుకుందాం...

- రేపే చనిపోతున్నట్లుగా జీవించు. శాశ్వతంగా బ్రతికి ఉండడం నేర్చుకో.
- భయం శారీరకమైన జబ్బు కాకపోవచ్చు. కానీ ఆత్మను హతమారుస్తుంది.
- శక్తి శారీరకమైన సామర్థ్యం నుంచి రాదు, మనసు లోని కోరిక నుంచి వస్తుంది
- నీ అంగీకారం లేకుండా నీ ఆత్మగౌరవాన్ని ఎవరూ తగ్గించలేరు.
- బలహీనుడిలో క్షమాగుణం ఎప్పటికీ కనిపించదు. అది బలవంతుడి లక్షణం.
- ప్రపంచంలో నేను ఒకే ఒక నియంతను అంగీకరిస్తాను. ...అంతరాత్మ
- నా ఇంటి కిటికీలు మూసి ఉండాలని నేనెప్పుడూ కోరుకోను. భిన్నదేశాల సంస్కృతుల పవనాలు వాటి గుండా స్వేచ్ఛగా ప్రయాణించాలి. అలాగని నా కాళ్ళు లాగేస్తానంటే నేనొప్పుకోను. ఇతరుల ఇంట్లో బానిసలా, బిచ్చగాడిలా ఉండటాన్ని కూడా అంగీకరించను.
- మానవసమాజం, మనస్సులు, మత, రాజకీయ, సామాజిక అడ్డుగోడలతో విభజింప బడకూడదు.
- భవిష్యత్తు గురించి ఆలోచించడం కంటే ఈ క్షణాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకోవడమే నాకు ఇష్టం.
- అధికారం రెండు రకాలు. భయపెట్టి సంపాదించేది, ప్రేమతో పొందేది. ప్రేమతో వచ్చే అధికారం, భయంతో వచ్చేదాని కన్నా శక్తివంతమైంది.
- ఎక్కడ ప్రేమ ఉందో అక్కడ దేవుడు ఉన్నాడు.
- ప్రతీ ఒక్కరూ అంతర్గతంగా ప్రశాంతతను కనుగొనాలి. నిజమైన శాంతి బాహ్యాపరిస్థితులకు ప్రభావితం కాదు.

నిలిచింది. దీనినే ఉదాహరణగా తీసుకున్న వినోబా భావే, ఇతర గ్రామాల్లోని జమిందారులు కూడా తమ భూమిని ఇవ్వడానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. దీనిని మరింత మెరుగుపరచి, గ్రామదానోద్యమంగా మార్చడం జరిగింది. దీనిలో గ్రామంలో ఉన్న మొత్తం భూమిని, గ్రామంలో భూమి లేనివారికి అందజేస్తారు. వారు ఆ భూమిని తమ మధ్య సమానంగా పంచుకుంటారు. 1974 తర్వాత ఈ ఉద్యమం నిలదొక్కుకోలేకపోయినప్పటికీ, గ్రామాల్లోని ప్రజల ఆలోచనా దృక్పథాన్ని మార్చడంలో ఈ ఉద్యమం చాలా కీలక పాత్ర పోషించింది. దేశంలోని ఏ ఒక్కరికీ తాను పండించగలిగేదానికన్నా ఎక్కువ భూమి ఉండకూడదన్న గాంధేయ నియమానికి ఈ ఉద్యమం అతి సమీపంలోకి వచ్చింది. దేశంలోని ప్రముఖ రాజకీయ నాయకులలో ఒకరైన జయప్రకాశ్ నారాయణ్, ఈ ఉద్యమంలో మమేకమయ్యారు. భూదానోద్యమం, గ్రామదానోద్యమాలకు తోడుగా – సంపత్తిదాన్ (ఆస్తిదానం), శ్రమదాన్ (శ్రమదానం), జీవన్‌దాన్ (గ్రామం కొరకు జీవితాన్ని ధారపోయడం) తదితర కార్యకలాపాలు కూడా ప్రచారంలోకి వచ్చాయి.

హక్కుల ఉల్లంఘన వల్ల జరిగే గాయాల కంటే వాటిని నిర్లక్ష్యం చేయడమే ఎక్కువ గాయపరుస్తుంది. లాంఛనాలు పెరిగిపోయిన ఆధునిక న్యాయవ్యవస్థ న్యాయాన్ని అందజేయాలనే లక్ష్యాన్ని చేరుకోలేకపోతోందని గాంధీజీ బాధపడేవారు. భారత దేశంలోని గ్రామ సమాఖ్యల ద్వారా వివాదాలను పరిష్కరించాలని, పురాతన వ్యవస్థను పునరుద్ధరించాలని ఆయన పూనుకున్నారు. సామాజిక న్యాయం అనే భావనను మరింత ముందుకు తీసుకెళ్లిన గాంధీజీ, న్యాయ నిర్ణయాధికారాన్ని ప్రజల చేతుల్లోనే పెట్టాలని భావించారు.

హరివల్లభ్ పరేఖ్ అనే గాంధేయవాది తూర్పు గుజరాత్‌లో ప్రజా కోర్టును నెలకొల్పారు. ఆయన ఆనంద నికేతన్ అనే ఆశ్రమాన్ని కూడా స్థాపించారు. తన పట్ల వ్యతిరేకంగా ఉన్న ప్రజలను మెల్లగా తన వైపు తిప్పుకున్న పరేఖ్ అనేక అభివృద్ధి కార్యక్రమాల ద్వారా దాదాపు వేయి గ్రామాల ప్రజలపై ప్రభావాన్ని చూపగలిగారు. ఆయన చేసిన కృషిలో విశేషంగా చెప్పుకోవాల్సిందేమిటంటే, ఆయన ప్రజాకోర్టుల ద్వారా దాదాపు 30 వేల కేసులను పరిష్కరించగలిగారు. వీటిలో ఎక్కువ భాగం కుటుంబ, ఆస్థి తగాదాలు. కొన్ని క్రిమినల్ కేసులను కూడా ఈ కోర్టుల్లో పరిష్కరించారు. అందరికీ న్యాయసమ్మతమైన విధానాలను అనుసరించిన ఆయన, దోషి కుటుంబంపై తీర్పు ప్రభావం అతి తక్కువగా ఉండేలా చూసేవాడు.

అధికారుల అలక్ష్యం పెరిగిపోయిన ఇంతటి భారీ వ్యవస్థలో అవినీతి తప్పనిసరిగా పెరుగుతుందని గాంధీజీ నమ్మేవారు. గాంధీజీ విధానాలు భారత జాతీయ కాంగ్రెస్‌కు తన రాజకీయ లక్ష్యాలు సాధించే సాధనాలైతే; గాంధీజీ, ఆయన అనుచరులకు అది ఒక జీవన విధానం. అందువల్లే స్వాతంత్ర్యానంతరం గాంధేయ విలువలు ఎందుకు పతనమయ్యాయో అర్థం చేసుకోవచ్చు.

గాంధీజీ ప్రవచించిన ప్రజలకే అధికారం అన్న భావనను నిజం చేయడం కష్టమైనదే అయినప్పటికీ, అది మన ఆలోచనా విధానాన్ని మాత్రం తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. వనరుల నిర్వహణపై స్థానికులకే అధికారాన్ని కట్టబెట్టడం ద్వారా జరిగిన ఈ ప్రయత్నాలను మనం దేశవ్యాప్తంగా చూడవచ్చు. మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలలో గాంధేయ స్ఫూర్తితో భూగర్భ జలాలను గ్రామం ఉమ్మడి వనరుగా భావిస్తారు. అది ఎవరి భూభాగంలో ప్రవహించినా దానిని అందరూ సమానంగా పంచుకుంటారు. నెమ్మదినెమ్మదిగా అభివృద్ధి ప్రాజెక్టుల వల్ల ప్రభావితులవుతున్న వారిని కూడా ఆ అభివృద్ధిలో భాగస్వాములను చేయాలన్న భావన ప్రజలందరిలో పెరుగుతోంది. కొన్ని కార్యకలాపాలలో వికేంద్రీకరణ సాధ్యమని, వ్యక్తిగత జీవితంలోని అన్ని అంశాలలో ప్రభుత్వాల జోక్యం అవసరం లేదనే భావన క్రమంగా పెరుగుతోంది. రక్షణ, రవాణా, సమాచార, విత్తం తదితర రంగాలు మాత్రమే ప్రభుత్వం నిర్వహించాలని, ఇతర రంగాలలో ప్రజల భాగస్వామ్యాన్ని నెలకొల్పవచ్చనే భావన క్రమేణా అభివృద్ధి చెందుతోంది. ✸